క్లుప్తంగా

హైదరాబాద్ వెళ్లి... పింఛన్ అందించి...



హైదరాబాద్ వెళ్లి నాగరాజుకు పింఛన్ అందజేస్తున్న 24 వార్డు వెల్ఫేర్ సెక్రటరీ కిరణ్‌కుమార్

భీమవరం(ప్రకాశం చౌక్) : భీమవరం పట్టణంలోని 24 వార్డుకు చెందిన మోటుపల్లి నాగరాజు హైదరాబాద్ సీటీన్యూరో ఆస్పత్రిలో బ్రెయిన్ సర్జరీ చేయించుకున్నారు. ఆయన భార్య కూడా డిజేబుల్ పెన్షన్ లబ్ధిదారులు ఆమె కూడా అక్కడ ఉండడంతో 24 వార్డు వెల్ఫేర్ సెక్రటరీ కిరణ్‌కుమార్ హైదరాబాద్ వెళ్లి నాగరాజుకు రూ.5 వేలు పింఛన్, ఆయన భార్యకు రూ. 3 వేలు పింఛన్ అందించాడు. కిరణ్‌కుమార్‌కు నాగరాజు కుటుంబ సభ్యులు, వార్డు ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

తల్లిపాలు బిడ్డకు వరం



సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి

కాళ్ల : తల్లిపాలు బిడ్డకు వరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎ.సూర్యకుమారి అన్నారు. మండల కేంద్రం కాళ్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు సూపర్‌వైజర్ పలు సూచనలు చేశారు. తల్లి పాలు బిడ్డకు రక్షణ కల్పిస్తాయని, వ్యాధులు రాకుండా అరికడతాయని వివరించారు. అంతేకాకుండా శిశువులు ఆరోగ్యంగా పెరుగుతారని, తల్లిపాలు పట్టడం వల్ల తల్లీబిడ్డకు ఆరోగ్యకరమని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

నేడు తణుకులో అండర్ -15 చెస్ పోటీలు

సాక్షి, భీమవరం : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం తణుకులో పట్టణస్థాయి అండర్-15 చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక విద్యావ్యాలీ ఒలింపియాడ్ స్కూల్‌లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో విజేతలు ఈనెల 13వ తేదీన భీమవరంలో జరిగే జిల్లాస్థాయి అండర్-15 చెస్ పోటీలకు తణుకు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని కిషోర్ తెలిపారు.

లోసరి గూట్లపాడు ఛానల్‌లో గుర్రపుడెక్క తొలగింపు



లోసరిలో ప్రొక్లెయిన్ సహాయంతో గుర్రపుడెక్క, చెత్తను తొలగిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలోని లోసరి గూట్లపాడు ఛానల్‌లో గుర్రపుడెక్క, నాచు, చెత్తను ప్రొక్లెయిన్ సహాయంతో తొలగిస్తున్నారు. ఈ ఛానల్ ద్వారా గొల్లవానితిప్ప, గూట్లపాడు, లోసరి, తోకతిప్ప, దొంగపిండి, కొత్తపూసలమర్రు గ్రామాల మీదుగా ప్రవహించి సుమారు 12 వేల ఎకరాలకు సాగు, తాగు నీరందుతుంది. ఇరిగేషన్ అధికారులు ఈ ఛానల్‌లో గుర్రపు డెక్క, చెత్త తొలగించడంతో శివారు ప్రాంతాలకు తాగు, సాగు నీరందుతుందని గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెదగరువు జగనన్న లేఅవుట్‌లో చురుగ్గా విద్యుత్ పనులు



జగనన్న లే అవుట్ వద్ద విద్యుత్ పనులు చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలోని పెదగరువులోని జగనన్న లే అవుట్‌లో చకచకా విద్యుత్ సంబంధిత పనులు వేగంగా జరుగుతున్నారు. గ్రామం మీదుగా జగనన్న లేఅవుట్‌కు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. కనీస మౌలిక సదుపాయాలైన విద్యుత్, తాగునీరు, రోడ్లు ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులు జగనన్న లే అవుట్‌లలో ఇళ్లు నిర్మించుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. విద్యుత్ సంబంధిత పనులను విద్యుత్ శాఖ ఏఈ నరసయ్య పర్యవేక్షించారు.

పల్లెకొచ్చి...పరీక్షలు చేసి...



గొల్లలకోడేరులో మంచంపై ఉన్న రోగిని పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డా.చినమిల్లి రంగమ నాయుడు, వైద్య సిబ్బంది



మోగల్లులో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

- గ్రామీణులకు చేరువైన వైద్యసేవలు
- సత్ఫలితాలు ఇస్తున్న ఫ్యామిలీ డాక్టర్

పాలకోడేరు: పల్లె ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా ప్రతి గ్రామంలోను మారుమూల ప్రాంతాలకు సైతం వైద్య సేవలు అందుతున్నాయి. ఒక్కో సచివాలయం పరిధిలో నెలలో రెండు పర్యాయాలు, ప్రభుత్వ డాక్టర్‌తో పాటు, ఎంఎల్‌హెచ్‌పీలు (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు) సిబ్బంది 104వాహనం ద్వారా వచ్చి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేస్తున్నారు. గతంలో పీహెచ్‌సీ లేదా సీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవడం ప్రజలకు భారంగా ఉండేది. దాని వల్ల రోగులు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లేందుకు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తర్వాత ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది.

దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దే సేవలు

ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మంచానికే పరిమితమైన వృద్ధులు, వికలాంగులు, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకున్న రోగులను ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. 14రకాల వైద్య పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందజేస్తున్నారు. వీటితో పాటు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు కూడా వైద్య సేవలు అందిస్తున్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఉండి నియోజకవర్గంలో ఆకివీడు, ఉండి, పాలకోడేరు, కాళ్ల మండలాలు ఉన్నాయి ఒక్కొక్క మండలానికి 104 వాహనాలు రెండు, ఇద్దరు వైద్యులు, 8మంది సిబ్బందితో రోజుకు సగటున 1000 మంది రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు.

90 రకాల మందులు

కొత్త వైద్య విధానంలో భాగంగా ఇంటి వద్దే పరీక్షలు నిర్వహిస్తున్నారు. 104వాహనంలో మెడికల్ ల్యాబ్‌లో 14రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా వైద్యులు సూచనలు మేరకు రక్తపరీక్షలు చేపడతారు. అలాగే అనారోగ్య సమస్యలను గుర్తించి బాధితులకు అప్పటికప్పుడే మందులు పంపిణీ చేస్తున్నారు. వాహనంలో 90 రకాల మందులు సిద్ధం చేశారు.

అందుబాటులో వైద్యం



మా ప్రాంతానికి నెలకు రెండు స్లారు 104వాహనం వస్తోంది. బీపీతో పాటు ఇతర సమస్యలను డాక్టర్ పరీక్షించి మందులు ఇస్తున్నారు. అంతేకాకుండా సలహాలు సూచనలు ఇస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ పథకం ప్రజలకు ఎంతో మేలు చేస్తోంది. దీని ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

పి కాంతమ్మ మోగల్లు

ముందస్తు సమాచారంతో



ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు,ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటికి వచ్చి ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ నెలలో ఏ రోజు వస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తున్నారు. అదే రోజు మేము అక్కడకు వెళ్లి సేవలు పొందుతున్నాము. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నారు.

మంతెన లీలావతి మోగల్లు

ప్రతి ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాం



గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం సచివాలయ పరిధిలో నెలకు రెండుసార్లు వెళ్లి ముందుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓపి నిర్వహిస్తున్నాం. ఇంటింటికి వెళ్లి పేషెంట్లను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ అందజేస్తున్నాం. చినమిల్లి రంగమ్మ నాయుడు, పిహెచ్ సి వైద్యాధికారి, పాలకోడేరు

మిద్దెవారిపాలెం వెలి బాధితుల వినతి



ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ సెల్ సభ్యురాలు సత్య సుధామకు వినత పత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్) : పెనుగొండ మండలం మిద్దెవారిపాలెం వెలి బాధితులు శనివారం భీమవరంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ సెల్ సభ్యురాలు జె.సత్యసుధామను కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సత్యసుధామ మాట్లాడుతూ మిద్దెవారిపాలెంలో రొక్కాల విజయగాంధీ, కుడిపూడి వెంకట నారాయణ మధ్య చేపల చెరువు విషయమై తలెత్తిన వివాదంలో 12 మంది దళిత కుటుంబాలను వెలి వేసినట్లు తెలిపారు. వీరిని గ్రామంలో పనులకు పిలవకపోవడం, కిరణా సరుకులు ఇవ్వకపోవడం, వారితో మాట్లాడేవారిని సైతం మాట్లాడ నివ్వకపోవడం వంటి చర్యలు కొనసాగుతున్నాయని, గ్రామంలో తమకు జరుగుతున్న అన్యాయం పట్ల రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారని, న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారని ఆమె తెలిపారు. దీని వల్ల ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీలు అందించడంలోనూ జాప్యం జరుగుతుందని, ఈ విషయాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని బాధితులకు హామీ ఇచ్చినట్లు సత్యసుధామ తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి కటికతల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భీమవరం అర్బన్: సీజనల్ వ్యాధులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సీహెచ్ ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని చినఅమిరం గ్రామంలో ఇటీవల వర్షాలు కురిసిన నేపథ్యంలో శనివారం ఏఎన్‌ఎమ్, ఆశావర్కర్లు ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేస్తున్నారు. వైద్యాధికారిని సీహెచ్ ధనలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలు, రక్షిత మంచినీటి చెరువులకు కొత్తనీరు నింపడం కారణంగా వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. ఇంటి పరిసరాల చుట్టూ మురుగునీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి కిటికీలకు, మెయిన్ డోర్‌లకు దోమలు రాకుండా మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌వీ మంజూష, ఏఎన్‌ఎమ్ సంధి శిరిషా, బాదం నాగమణి, సంధి లిలియా రజిత వల్లి, సంధి రూతు, సంధి సువర్ణ కుమారి,మట్టా దీపిక, దాసరి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్‌కు నాక్ గుర్తింపు ప్రశంసనీయం



కళాశాల పాలకవర్గాన్ని సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించడం గొప్ప విశేషమని భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణ రాజు(బాబు)లను మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాంబాబు మాట్లాడుతూ 78 ఏళ్ల క్రితం కళాశాలను ఏర్పాటు చేసిన దంతులూరి నారాయణరాజు(డీఎన్నార్) ఆశయాలకు అనుగుణంగా పాలకవర్గం చేస్తున్న కృషి కారణంగానే జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, సహాయ కార్యదర్శి కొత్తపల్లి శివరామరాజు, బోసురాజు, కూనపరాజు రామకృష్ణంరాజు, కొత్త శ్రీను, కారుమూరి సత్యనారాయణమూర్తి, ఓలేటి శ్రీను, కోట్ల నాని, భట్టిప్రోలు శ్రీనివాసరావు, బొండా హనుమంతరావు, కంచర్ల భాస్కరరావు గుప్తా, గుండు సుమూర్తి, ఏవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలి



గొల్లవానితిప్ప పీహెచ్‌సీలో కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

భీమవరం అర్బన్: ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని వృద్ధులు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు అన్నారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలోని కొప్పర్తి వీరాస్వామి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించి వివిధ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో అప్పారావు, పీహెచ్‌ఎన్ పుష్ప, సీహెచ్‌వో ప్రభావతి, ఎంపీహెచ్‌ఎస్ రాము, చంద్రమౌళి, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శిశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



చిలుకూరులో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్న సర్పంచ్ వెంకటసోమరాజు

ఉండి: శిశువుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చిలుకూరు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ముదునూరి వెంకటసోమరాజు అన్నారు. శనివారం ఉండి మండలం చిలుకూరులో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లను సర్పంచ్ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఇలా అన్ని దశల్లోను మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ఎందుకంటే మహిళలు గర్భవతులుగా ఉండగా వారికి కావలసిన సంరక్షణ అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్నారన్నారు. వైద్య సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. సుఖప్రసవాలు చేసేలా వైద్య సిబ్బంది, వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండాలని వారికి ప్రత్యేక వాహనాన్ని కూడా సిద్ధం చేసి ఆస్పత్రి నుంచి ఇంటికి పంపుతున్నారన్నారు. పౌష్టికాహార లోపంతో ఎంతో మంది గర్భిణీలు ప్రసవ సమయంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అందుకే ప్రత్యేకంగా రాగిపిండి, అటుకులు, ఖర్జూరం, పెసలు, చిక్కీలు, గుడ్లు, పాలు, బెల్లం, ఆయిల్ వంటి అత్యుత్తమ నాణ్యత కలిగిన పౌష్టికాహార సరుకులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వితంతువుకు నిత్యావసరాల పంపిణీ



భీమవరంలో దుర్గమ్మకు నిత్యాసవర సరుకులు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న వితంతువు బోణం దుర్గమ్మ నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలు అందించారు. ఈసందర్భంగా సంస్థ భీమవరం మండల శాఖ అధ్యక్షుడు బుద్ధరాజు వెంకటపతిరాజు మాట్లాడుతూ ఇటీవల భర్తను కోల్పోయి చిన్నపిల్లతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న దుర్గమ్మ సమాచారం స్థానికుల ద్వారా తెలుసుకోవడంతో శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ అల్లు శ్రీనివాస్ ప్రోత్సాహంతో సంస్థ ద్వారా సహకారం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కారుమూరి నర్సింహమూర్తి, కోశాధికారి సన్నిధి నాగభూషణరావు, ఇందుకూరి శివాజీ వర్మ, మహేశ్వరి పాల్గొన్నారు .

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల : ముఖ్యమంత్రి సహాయ నిధి పేద రోగులకు ఎంతో ఉపయోగపడుతోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన భీమవరపు సుల్తాన్ బాషా కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.50 లక్షల చెక్కును కాళ్ల మండలం పెద అమిరం గ్రామంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారునికి ఆయన అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మందు పంపిణీకి ఏర్పాట్లు



ఉండిలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉండి: ఈ నెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణోత్సవ కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ, పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల నివారణపై ప్రజలకు అవగాహన కలిగించే పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ అప్పారావు, డాక్టర్ సత్యేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ - 23ను జయప్రదం చేయాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రైల్వే అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

భీమవరం(ప్రకాశం చౌక్) : అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ - 23 కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైల్వే డివిజన్ పర్యవేక్షకుడు డీఈఎన్ ఈస్ట్ విజయవాడ కె.శ్రీధర్ కోరారు. శనివారం భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ అవరణలో రైల్వే అధికారులు, స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ -23 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. శ్రీధర్ మాట్లాడుతూ రైల్వే శాఖ దేశ వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌ను ఈనెల 6న ప్రారంభిస్తుండగా, భీమవరం టౌన్ స్టేషన్‌లో ఉదయం 9 గంటలకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. డివిజన్‌లో భీమవరం, నరసాపురం స్టేషన్లు ఎంపికైనట్లు చెప్పారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, జనపాటి మధుసుదనరావు, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ ఈ కారక్రమానికి అందరూ తరలిరావాలని కోరారు. విజయవాడ ఏపీవో కె.శ్రీనివాస్‌రావు కార్యక్రమ ప్రణాళికను వివరించారు. భీమవరం ఏడీఈఎన్ ఎ.శంకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ టి.సాంబశివరావు, సీఐ దస్తగిరి, జేఈ డి.మధుసుదన్‌రెడ్డి, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల ప్రత్యేక స్పందన పునఃప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతిబాబు

సాక్షి, భీమవరం : దళితుల సమస్యల పరిష్కారానికి జిల్లాలో ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని పునః ప్రారంభించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. శనివారం భీమవరం యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమితి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేవీపీఎస్ నిరంతర పోరాటం చేస్తోందని, గతంలో దళిత సమస్యలపై ప్రత్యేకంగా స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని, దానిని పునరుద్ధరించాలని కోరారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందనలో జిల్లా వ్యాప్తంగా దళితులు తమ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదులు చేస్తున్నారన్నారని తెలిపారు. నిర్ణీత కాలంలో దళిత ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే గతంలో ప్రారంభించిన ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని తిరిగి కొనసాగించాలని క్రాంతిబాబు కోరారు. ప్రతినెలా జరిగే సివిల్ రైట్స్ డే కార్యక్రమం తూతూ మంత్రంగా జరుగుతుందని ఆరోపించారు. సివిల్ రైట్స్ డే సమావేశానికి తహసీల్దార్, ఎస్సై ఖచ్చితంగా హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయకుమార్, ఉపాధ్యక్షుడు దిగుపాటి రాజగోపాల్, సహాయ కార్యదర్శులు చిన్నం చిన్న నాగేశ్వరరావు, కానేటి బాలరాజు, మాదాసి గోపి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న గంటా త్రిమూర్తులు

సాక్షి, భీమవరం : ప్రభుత్వ పాఠశాలల్లో చక్కటి విద్యాబోధన కారణంగా పదో విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి ట్రిపుల్ ఐటీకి వెళుతున్నారని, ఎంపికైన విద్యార్థులను దాతల ప్రోత్సహించడం అభినందనీయమని భీమవరం పొట్టిశ్రీరాములు మునిసిపల్ (సీఎస్ఎమ్)గరల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని జె.సుధారాణి అన్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు శనివారం నగదు సహాయం అందించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన కె.కీర్తి, టి.మేఘన, డి.నందిని, వై.దీపిక , కె.కృష్ణప్రియ, ఝాన్సీలక్ష్మీబాయి, మునిసిపల్ పాఠశాల విద్యార్థి వి.రమాదేవి ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకీ ఎంపికైయ్యారని వారందరికీ కృష్ణబలిజ సాధికారిక సంఘం రాష్ట్ర నాయకుడు గంటా త్రిమూర్తులు ఆర్థిక సహాయం అందించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో గంటా త్రిమూర్తులు, చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం, యలమంచిలి శ్రీనివాస్, టి.ఆనంద్, వారణాసి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

9న మహాధర్నా

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9వ తేదిన భీమవరంలో నిర్వహించే మహాధర్నా విజయవంతం చేయాలని సీఐటీయు పట్టణ కార్యదర్శి బి వాసుదేవ రావు పిలుపునిచ్చారు. శనివారం భీమవరంలో సింహాద్రి సిరీష్ అధ్యక్షతన జరిగిన సీఐటీయు విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రధాన నరేంద్రమోదీని గద్దెదించేవరకు పోరాడాలన్నారు. కార్మికుల కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలన్న కార్మికుల డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో ఎ శ్రీనివాసరావు, బంగారు లక్ష్మి, నాలాపు రాజు, కె వెంకటేశ్వరరావు, కె సత్యనారాయణ, నాగు, బాబురావు, బి విజయలక్ష్మి, జ్యోతి, సరోజని, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.